క్లుప్తంగా

పోలింగ్ స్టేషన్లలో వసతుల తనిఖీ



పోలింగ్ స్టేషన్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఈఆర్వో వెంకటరావు

కాకినాడ: నియోజకవర్గ ఈఆర్ఓ, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు శనివారం పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. పోలీస్ లైన్ ఆవరణలోని 14, 15, 16 పోలింగ్ స్టేషన్లకు వెళ్లిన ఆయన అక్కడి సదుపాయాలను ఆరా తీశారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలు, సమస్యల గురించి ఎన్నికల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వసతుల కల్పనకు ఏ అవసరమైనా వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం లేకుండా తీసుకోవలసిన చర్యలపై అధికారులకు పలు సూచనలిచ్చారు. ఆయన వెంట ఏఈఆర్వోలు దొర, సీతాపతిరావు, మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

కడియం వెళ్లి పింఛను అందజేత

కరప: మండలం నడకుదురు గ్రామానికి చెందిన వృద్ధురాలు సాలగ్రామ సూర్యాంబ అస్వస్థతతో కడియం గ్రామంలో ఉండి పింఛను తీసుకోలేకపోయింది. ఇది గ్రహించిన కార్యదర్శి పీఎస్ఆర్ బ్రహ్మానందం వలంటీర్ ఎ.అనిల్‌శివకుమార్‌కు చెప్పి ఆమెకు శనివారం రూ.3 వేల పింఛను అందేలా చేశారు. దీంతో సూర్యాంబ వలంటీర్‌ను అభినందించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దయవల్ల పింఛను తీసుకోగలిగానని సంతోషం వ్యక్తం చేసింది.

నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

కాకినాడరూరల్: సర్పవరం జంక్షన్‌లో మీ కోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన గ్రంథాలయ విశ్రాంతి అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ తాత్కాలిక ఆకర్షణ, ఆనందం కోసం కొందరు యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. క్లబ్ వ్యవస్థాపకులు పిల్లి నాగేశ్వరరావు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

- నిందితుడి పరారీ



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో వెంకటేశ్వరరావు బృందం

కాకినాడ క్రైం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నేరంలో నిందితులు తృటిలో తప్పించుకున్నారు. నిందితుల్లో ఒకరు స్నేహితుడితో పరారు కాగా, ఒక మహిళ పోలీసులకు చిక్కింది. వివరాల్లోకి వెళితే, తొండంగి మండలం అద్దరిపేట గ్రామానికి చెందిన గరికిన శ్రీను తన తల్లి సహకారంతో స్నేహితుడు మచ్చా వీరబాబుతో కలిసి గ్రామంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నాడు. ఈ సమాచారం అందుకున్న సెబ్ బృందం శనివారం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో నిందితులు శ్రీను, వీరబాబు పరారు కాగా బంగారమ్మ పట్టుబడింది. విక్రయ స్థావరాలపై దాడిచేసిన బృందం 236 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుంది. సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ సమాచారంతో ఈ దాడులు నిర్వహించినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, ఈసీఎస్ రమణ, నవీన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇనోదయలో మెగా వైద్య శిబిరం

బోట్‌క్లబ్: కాకినాడ నాగమల్లి జంక్షన్ సమీపంలోని ఇనోదయ ఆస్పత్రి వద్ద సోమవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఆస్పత్రి చైర్మన్ జి.రామ్మోహన్, సీఈఓ లావణ్య తెలియజేశారు. వైద్య శిబిరంలో నిష్ణాతులైన వైద్యులతో రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని, మందులపై 10 శాతం రాయితీ అందించనున్నట్టు శనివారం వారు తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 0884– 2333033ను సంప్రదించాలని కోరారు.

శృంగార వల్లభుని ఆలయం భక్తులతో కిటకిట

పెద్దాపురం: మండలంలోని శృంగారవల్లభ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువ జాము నుంచి వందల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో గంటల తరబడి భక్తులు క్యూలోనే నిరీక్షించాల్సి వచ్చింది. ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, జిల్లా దేవదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామిని అలంకరించి, భక్తులకు ఆశీర్వచనాలు ఇచ్చారు.

విజయమే లక్ష్యంగా సిద్ధం

- దెందులూరు సభకు తరలిన పార్టీ శ్రేణులు
- వందలాది కార్లు, బస్సుల్లో పయనం

కాకినాడ: ఏలూరు జిల్లా దెందులూరులోని 'సిద్ధం' బహిరంగ సభకు కాకినాడ నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలి వెళ్లాయి. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పర్యవేక్షణలో సుమారు 70 బస్సులు, 50 కార్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అక్కడకు వెళ్లారు. నగరంలోని ఆయా డివిజన్ల నుంచి బయలుదేరిన పార్టీ కేడర్‌కు అవసరమైన అల్పాహారం, ఇతర సదుపాయాలను ఆయన ఏర్పాటు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జరిగిన ఈ బహిరంగసభకు అత్యంత ఉత్సాహంగా క్యాడర్ తరలివెళ్లింది.

కాకినాడ రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సన్నాహకంగా ఏలూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించనున్న సిద్ధం బహిరంగ సభకు నియోజవర్గం నుంచి శనివారం ఉదయం వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో నియోజకవర్గ ప్రజలతో పాటు అర్బన్ 8 డివిజన్ల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు, మహిళలు వెళ్లారు. ఇందుకు గాను నియోజకవర్గంలో 50 బస్సులు ఏర్పాటు చేశారు. సుమారు 200 కార్లతో నాయకులు, అనుచరులు వెళ్లారు.

కరప నుంచి తరలివెళ్లిన పార్టీ శ్రేణులు

కరప: ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పిలుపు మేరకు మేముసైతం సిద్ధం అంటూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సందేశం వినేందుకు శనివారం ఏలూరులోని దెందులూరులో జరిగిన సిద్ధం సభకు మండలం నుంచి ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితర క్యాడర్ అంతా బస్సులలో, కార్లలో తరలివెళ్లారు. మండలం నుంచి బస్సులు, కార్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామానికి రాగా ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి తదితరులు జెండా ఊపగా అంతా కలసి దెందులూరు సభకు వెళ్లారు.



సిద్ధం సభకు బయలుదేరిన కాకినాడ సిటీ నియోజకవర్గ పార్టీ శ్రేణులు



కరపలో మేము సిద్ధం అంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు



కాకినాడ రూరల్ మండలం నుంచి సిద్ధం సభకు ప్రయాణమవుతున్న నాయకులు, కార్యకర్తలు

14న వేంకటేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ



వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే ద్వారంపూడి దంపతులతో భక్తులు

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: పూర్తి రాతికట్టుతో నిర్మిస్తున్న స్థానిక సాంబమూర్తినగర్‌లోని పద్మావతి, గోదాదేవి సమేత వైభవ వేంకటేశ్వరస్వామి దివ్య విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 14వ తేదీన వేడుకగా నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. స్థానిక సాంబమూర్తినగర్‌లో రూ.4 కోట్ల వ్యయంతో ఈ ఆలయం రూపుదిద్దుకుంటోంది. విగ్రహ ప్రతిష్ఠకు ముహూర్తం నిర్ణయించిన నేపథ్యంలో ఆలయానికి సంబంధించిన ధ్వజస్తంభం, పద్మావతిదేవి, వేంకటేశ్వరస్వామి, గోదాదేవి, జయ, విజయులు, గరుడ విగ్రహాలతో పాటు ధ్వజస్తంభం శనివారం సాయంత్రం కాకినాడ చేరుకున్నాయి. వీటిని చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతుల సమక్షంలో వెంకటనగర్‌లోని ఆలయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు, మహిళలు ఊరేగింపుగా భజనలు, గోవింద, విష్ణునామస్మరణతో సాంబమూర్తినగర్‌లోని ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ తన సొంత నిధులతో ఆలయ నిర్మాణాన్ని చేపడుతున్నట్టు చెప్పారు. ఆలయ నిర్మాణ పర్యవేక్షకులు జొన్నాడ చినబాబు–నాగేశ్వరి దంపతులతో పాటు అన్నవరం ట్రస్టుబోర్డు సభ్యులు కర్రి భామిరెడ్డి, కర్రి వీర్రెడ్డి, పెంకే రవి, రాగిరెడ్డి కన్నా, సుంకర విద్యాసాగర్, సుబ్బారెడ్డి, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

సాగునీటిని సమర్థంగా వినియోగించాలి

- జేసీ ప్రవీణ్ ఆదిత్య
- రబీలో నీటి సరఫరాపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య

కాకినాడ సిటీ: జిల్లాలోని నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ రబీలో రైతులకు ప్రణాళిక ప్రకారం సాగు నీరు అందించాలని జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సాగునీటి పంపిణీ, ఇతర అంశాలపై అధికారులతో సమీక్షించారు.

జిల్లాలో గోదావరి ఆయకట్టు, ఏలేరు ఆయకట్టు, పంపా రిజర్వాయర్ కింద సాగవుతున్న పంటల వివరాలు, సాగునీటి లభ్యత, కాలువల పరిస్థితులపై చర్చించారు. ఇందుకు ఇరిగేషన్, వ్యవసాయ, డ్రైయిన్ల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. జిల్లాలో నూరు శాతం వరి నాట్లు పూర్తయ్యాయని, గోదావరి ఆయకట్టు కింద 1.35 లక్షల ఎకరాలు, ఏలేరు ఆయకట్టు కింద 53 వేల ఎకరాలు, పంపా రిజర్వాయర్ కింద సుమారు 10 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నట్లు జేసీ ప్రవీణ్ ఆదిత్య వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 85 శాతం ఈ–క్రాప్ బుకింగ్ పూర్తయిందన్నారు. సమావేశంలో ధవళేశ్వరం నీటిపారుదల శాఖ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, పెద్దాపురం ఈఈ డి.రాంగోపాల్, రామచంద్రపురం ఈఈ వి.రామకృష్ణ, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ శాఖ అధికారి బీవీఎస్ హరి, డ్రెయిన్స్ ఈఈ ఇతర అధికారులు పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న ప్లాట్ల రిజిస్ట్రేషన్



కరప గ్రామ సచివాలయంలో జగనన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

కరప: స్థానిక గ్రామ సచివాలయంలో జగనన్న ప్లాట్ల రిజిస్ట్రేషన్లు మూడు రోజులుగా చురుగ్గా సాగుతున్నాయి. పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సూచనల మేరకు కరపలో 130 ఎకరాలు, ఇతర గ్రామాల్లో భూమిని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి జగనన్న మెగా కాలనీ ఏర్పాటు చేసింది. వీటిలో 5,324 మందికి ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఆయా ఇళ్ల స్థలాల పట్టాలను సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసి, డాక్యుమెంట్ ఇచ్చే ప్రక్రియ సాగుతోంది. కరప, పెద్దాపురప్పాడు, కూరాడ గ్రామాలకు చెందిన లబ్ధిదారుల ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేస్తున్నామని గ్రామ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్ తెలిపారు. ఇంత వరకూ 289 మందికి రిజిస్ట్రేషన్లు చేశామన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ కె.అబ్బాయి, వీఆర్వో కె.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్‌కు ఆత్మీయ వీడ్కోలు



డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

కాకినాడ: నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా సేవలందించి నిడదవోలు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న కోన శ్రీనివాస్‌కు కార్పొరేషన్ సిబ్బంది శనివారం ఆత్మీయ వీడ్కోలు పలికింది. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆధ్వర్యంలో వివిధ విభాగాధిపతులు డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ సేవలను కొనియాడారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి పన్నుల వసూళ్లలో కాకినాడ కార్పొరేషన్‌ను అగ్రస్థానంలో నిలబడేలా ఆయన ఎంతో శ్రమించారని ఏడీసీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. ఎస్ఈ సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, ఈఈ మాధవీ, ఏఓ శిరీష్, ఆర్‌వోలు పాల్గొన్నారు.

రంకెలేస్తూ పోటీకి సై

- నేడు రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు
- వివిధ జిల్లాల నుంచి 50 జతల ఎడ్లు రాక
- సీనియర్, జూనియర్ విభాగాల్లో పందేలు



పరుగు పోటీలకు సిద్ధంగా ఉన్న ఎడ్లు



ఎడ్లకు మసాజ్ చేస్తున్న రైతులు

సామర్లకోట: స్థానిక ఉండూరు రైల్వే గేటు ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో ఆదివారం ఉదయం రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహిస్తున్నారు. శ్రీభీమేశ్వర ఎడ్ల పరుగు ప్రదర్శన సంఘం ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరుగుతుంది. ఈ ప్రదర్శనలో సీనియర్, జూనియర్ విభాగాలలో ఎడ్ల బళ్లు పాల్గొంటాయి. ఈ ప్రదర్శనకు సహాయం అందిస్తున్న చంద్రమౌళి చారిటబుల్ ట్రస్టు అధినేత గుణ్ణం చంద్రమౌళి, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంతపద్మనాభం పారిశ్రామిక వేత్త చందలాడ బాబ్జీ పాల్గొంటారని కమిటీ నాయకులు కొండపల్లి శ్రీనివాసు, బిక్కిన రంగనాయకులు, కాటూరి జానికిరామ్, పైణి గౌరీచంద్, చిట్టియ్యలు శనివారం స్థానిక విలేకర్ల సమావేశంలో తెలిపారు. సీనియర్ విభాగంలో ఎడ్లు 1500 మీటర్లు, జూనియర్ విభాగంలో ఎడ్లు వెయ్యి మీటర్లు వెళ్లి రావలసి ఉంటుందన్నారు. విజేతలకు సీనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, జూనియర్ విభాగంలో ఐదు బహుమతులతో పాటు, ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నారు. విశాఖపట్నం నుంచి ఏలూరు వరకు సీనియర్ విభాగంలో 10 జతలు, జూనియర్ విభాగంలో 35 జతల ఎడ్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. పోటీలకు హాజరైన ఎడ్ల బండ్ల యజమానుల సమక్షంలో డ్రా తీసి సీరియల్ ప్రకారం ప్రదర్శనకు అనుమతి ఇస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారికి వసతి, భోజన సదుపాయాలను నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కొండపల్లి శ్రీను, పీఈటీలు వీరబాబు, కోట్ని శ్రీను వ్యవహరిస్తారు. పోటీలకు ఎక్కువ ఎడ్లు రావడంతో ఉదయమే ప్రదర్శన పోటీలు ప్రారంభం అవుతాయని నిర్వాహకులు తెలిపారు. రైతు సంఘ నాయకులు, నిర్వాహకులు పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం....



రాష్ట్ర స్థాయిలో జరిగే ఎడ్ల పరుగు పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశాం.1992 నుంచి శ్రీభీమేశ్వర రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహిస్తున్నాం. అంతరించిపోతున్న ఎడ్ల బళ్ల పోటీలను ప్రోత్సహించడానికి తరుచూ ఇటువంటి పోటీలు నిర్వహిస్తున్నాం.

– కొండపల్లి శ్రీనివాసు, న్యాయ నిర్ణేత, సామర్లకోట

ఖైదీల్లో పరివర్తన అవసరం

- సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

పెద్దాపురం: నేరాలు చేసి శిక్ష అనుభవిస్తున్న ఖైదీల్లో పరివర్తన ఎంతో అవసరమని రాజమహేంద్రవరం సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి అన్నారు. శనివారం పెద్దాపురం సబ్ జైలులోని ముద్దాయిలకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆమె ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరాలు చేసి శిక్ష అనుభవించిన తరువాత మళ్లీ నేరాలకు పాల్పడడం తగదన్నారు. అటువంటి వారికి శిక్ష మరింత కఠినంగా ఉంటుందని, ఖైదీలు పరివర్తన చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ముద్దాయిలకు అందుతున్న భోజన వసతి సౌకార్యలను ఆమె పరిశీలించారు. ఆమె వెంట మానవ హక్కుల సంఘం నాయకులు నూతలపాటి అప్పలకొండ, జైలు సిబ్బంది ఉన్నారు.

నవోదయలో వసతుల తనిఖీ

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో శనివారం తూర్పుగోదావరి జిల్లా జడ్జి ప్రత్యూషకుమారి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యాలయలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. విద్యార్థులకు అందిస్తున్న బోధన, శిక్షణ ప్రణాళికా అంశాలపై ప్రిన్సిపాల్ కమలంను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణ, ఆటస్థలం, డార్మిటరీ, భోజనశాల, వంటశాలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

క్యాన్సర్‌ను జయించారు

- ఆదుకున్న ఆరోగ్యశ్రీ
- బాధితుల చికిత్సకు రూ.లక్షలు వెచ్చించిన ప్రభుత్వం
- నేడు ప్రపంచ క్యాన్సర్ డే



క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వైడీ రామారావు. చిత్రంలో వైద్యులు

కాకినాడ రూరల్: ఎప్పుడు.. ఎలా.. ఎందుకు వస్తుందో తెలీదు.. మన శరీరంలో మనకే తెలియకుండా చిన్నగా ప్రారంభమై.. వేయి విషపు కోరలతో విరుచుకుపడుతోంది. శరీరంలో ఏదో తేడా జరుగుతోందని గుర్తించేలోపే నిండు ప్రాణాల్ని నిశ్శబ్దంగా కబళించేస్తోంది. ఈ మహమ్మారి క్యాన్సర్ మన దేశంలో అత్యంత ప్రమాదకరంగా జడలు విప్పుకుంటోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గణాంకాల ప్రకారం 2022లో మన దేశంలో 14.1 లక్షల క్యాన్సర్ కేసులు నమోదవగా 9.1 లక్షలు మంది ప్రాణాలు కోల్పోయారు. పురుషుల్లో పెదవులు, నోరు, ఊపిరితిత్తుల క్యాన్సర్లు, మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు ఎక్కువగా నమోదువుతున్నాయి. కొత్త కేసుల్లో ఎక్కువగా బ్రెస్ట్, సెర్విక్స్ యుటెరిన్ క్యాన్సర్లు ఉన్నట్టు గుర్తించారు. క్యాన్సర్ బాధితుల సంఖ్య 5 కోట్లకు చేరినట్టు అంచనా. ఆదివారం– ప్రపంచ క్యాన్సర్ అవేర్‌నెస్ డే. ఈ సందర్భంగా పలు సంస్థలు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నాయి.

అండగా నిలుస్తున్న ప్రభుత్వం

క్యాన్సర్ బారిన పడిన వారికి మన రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తోంది. వారి చికిత్సకు అయ్యే వ్యయాన్ని భరిస్తోంది. దీనికోసం రోగులకు లక్షల రూపాయలు కేటాయిస్తోంది. ఆరోగ్యశ్రీలో చికిత్స అందించే ప్రొసీజర్లను 3 వేలకు పైగా పెంచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. క్యాన్సర్ చికిత్సను కూడా ఇందులో చేర్పించారు. ఫలితంగా పేద రోగులకు పైసా ఖర్చు లేకుండానే సర్జికల్ ఆంకాలజీ, కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ వంటివి అందుతున్నాయి.

ప్రజల్లో చైతన్యంతో..

మానవళి మనుగడకు క్యాన్సర్ మహమ్మారిగా దాపురించిందని రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ వైడీ రామారావు అన్నారు. అచ్చంపేట జంక్షన్ వద్ద మెడికవర్ ఆస్పత్రిలో శనివారం ఏర్పాటు చేసిన క్యాన్సర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, క్యాన్సర్‌ను జయించిన వారికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్యాన్సర్ అనుమానం వస్తే భయపడకుండా వైద్యులను సంప్రదించి, చికిత్స చేయించుకుంటే ప్రాణాలను కాపాడుకోవచ్చని చెప్పారు. వైద్య ఖర్చును ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా భరిస్తోందన్నారు. ఆరు నెలల కాలంలో పది శాతం బరువు తగ్గితే క్యాన్సర్ సోకినట్లు అనుమానించాల్సిందేనని వైద్యులు జి.మురళీధర్, పృథ్వీరాజ్, ప్రదీప్ భాస్కర్, ప్రశోక్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ గౌరమ్‌రామ్ అన్నారు. ప్రతి ఒక్కరూ ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, పొగాకు, సిగరెట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కల్తీ వంట నూనెలతో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. రోజూ వ్యాయామం, వాకింగ్ చేయడం మంచిదని సూచించారు.

మా కుటుంబం జగనన్నకు రుణపడి ఉంటుంది



శంఖవరం మండలం కొత్తూరుకు చెందిన ఈమె పేరు ఎస్.లక్ష్మీ ప్రభావతి. వయస్సు 25 ఏళ్లు.. భర్త, ఇద్దరు పిల్లలు. లక్ష్మీ ప్రభావతి క్యాన్సర్ బారిన పడిందని తెలిసి ఆమెతో పాటు, పిల్లలు, భర్తను దుఃఖంలో మునిగిపోయారు. ఆమె ప్రాణం దక్కదన్న ఇరుగుపొరుగు వారి మాటలతో మరింతగా అధైర్యం చెందారు. ప్రాణాలు చేత పట్టుకుని వైద్యులపై భారం వేసి ముందుకు వెళ్లారు. సకాలంలో సరైన చికిత్స అందడంతో గత ఏడాది నవంబరులో ఆమె క్యాన్సర్‌ను జయించింది. చికిత్సకైన రూ.1.30 లక్షల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా మంజూరు చేసి ఆదుకుంది. తన ప్రాణాలు కాపాడిన వైద్యులకు, ఆర్థికంగా ఆదుకున్న సీఎం జగన్‌కు తమ కుటుంబం రుణపడి ఉంటుందని ప్రభావతి చెబుతోంది.

– లక్ష్మీ ప్రభావతి

పేదలకు ఆరోగ్యశ్రీ వరం



అమలాపురానికి చెందిన ఈయన పేరు పిల్లి సత్యనారాయణ. బ్రెయిన్ క్యాన్సర్ వచ్చింది. ఆయన చికిత్సకు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా రూ.1.5 లక్షలు మంజూరు చేసింది. క్యాన్సర్ వచ్చిందని భయపడితే ప్రాణాలు పోతాయని. ధైర్యం చేసి వైద్యం చేయించుకుంటే ప్రాణాలు నిలుస్తాయని సత్యనారాయణ అంటున్నారు.

– పిల్లి సత్యనారాయణ

రూ.5 లక్షలు ఇచ్చారు



మాది పిఠాపురం మండలం కొత్తూరుకు చెందిన దుడ్డి సత్తిబాబుకు వెన్నెముక క్యాన్సర్ వచ్చింది. బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా వైద్యం చేసి నయం చేశారు. ఈ చికిత్సకు ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసింది. నాలాంటి ఎందరినో జగనన్న ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా ఆదుకుంటోందని సత్తిబాబు చెప్పారు.

– దుడ్డి సత్యనారాయణ

భీమేశ్వరాలయ ట్రస్టు బోర్డుకు దరఖాస్తుల స్వీకరణ

సామర్లకోట: స్థానిక బాలాత్రిపురం సుందరి సమేత కుమారా రామ భీమేశ్వర ఆలయంలో ట్రస్టు బోర్డు సభ్యుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఈఓ డి.నాగమల్లేశ్వర రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. దేవదాయ శాఖ నిబంధనలకు లోబడి ఆలయంలో సేవ చేయాలనే ఆలోచన ఉన్న వారు ట్రస్టు బోర్డులో సభ్యత్వానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 22వ తేది లోపుగా దరఖాస్తులను కాకినాడ లోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయం లేదా విజయవాడలోని దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని ఈఓ సూచించారు.

పాదగయ పాలక మండలి నియామకానికి...

పిఠాపురం: పిఠాపురంలో ప్రముఖ శైవ క్షేత్రమైన పాదగయ కుక్కుటేశ్వరస్వామి ఆలయానికి పాలక మండలి నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. పాలక మండలి సభ్యుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు దరఖాస్తులను పూర్తి చేసి 20 రోజుల లోపు కాకినాడ దేవదాయశాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆలయ పాలక మండలి సభ్యులను నియమిస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఆలయ పని వేళల్లో అధికారులను సంప్రదించాలన్నారు.